క్లుప్తంగా

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

నల్లజర్ల: మండలంలో అన్ని గ్రామాల్లో వరి రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ గురువారం సూచించారు. రైతులంతా తమ పొలంలో ఉన్న ఎలుక బొరియలను అన్నీ మూసివేయాలన్నారు. శుక్రవారం ఎన్ని బొరియలు తెరుచుకున్నాయో గమనించి అక్కడ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే మందును అందరూ సామూహికంగా ఒకేసారి వినియోగించి ఎలుకలను నిర్మూలించాలన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే చర్యలు



తాళ్లపూడిలోని షాపుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

తాళ్లపూడి: ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ముఖ్యంగా తక్కువ మైక్రోన్స్ గల ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మండలంలోని తాళ్లపూడి, కుకునూరు సచివాలయ సిబ్బంది తాళ్లపూడి మెయిన్ రోడ్డులోని పలు షాపుల్లో ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న ఆదేశాల మరకు తనిఖీలు చేశారు. పల్చటి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వాడకం నిలిపివేయాలని దుకాణదారులకు తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేశారని, హెచ్చరికలు పట్టించుకోకుంటే రూ.5,000 వరకు జరిమానా విధిస్తామని కుకునూరు కార్యదర్శి అనురాధ తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో వ్యాపారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని ఆమె తెలిపారు. మహిళ పోలీస్ సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు సక్రమంగా నిర్వహించాలి

విజిలెన్స్ సీఐ మధుబాబు



గోపాలపురంలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న సీఐ మధుబాబు, రెవెన్యూ సిబ్బంది

గోపాలపురం: రేషన్ షాపులు సక్రమంగా నిర్వహించాలని వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సరకులు అందించాలని విజిలెన్స్ సీఐ ఏ మధుబాబు అన్నారు. గోపాలపురంలో బుధవారం 2, 4, 5, 6 రేషన్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం షాపు నెంబరు 2లో 6 కేజీల పంచదార ఎక్కువ ఉండడంతో 6ఏ కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మండలంలోని వివిధ షాపుపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈయన వెంట సివిల్ సప్లై డీటీ టి.దివాకర్, వీఆర్వో కె.లక్ష్మి సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



తిమ్మరాజుపాలెంలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సభ్యులు

నిడదవోలు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గుంటుపల్లి శ్రీనివాస్ అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో తిమ్మరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు బుధవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మీసాల హరి ప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, హెచ్ఎం హెప్సిబా, క్లబ్ సభ్యులు పి.శ్రీనివాస్, నీలం నాగేంద్రప్రసాద్, కారింకి సాయిబాబా, కేదారిశెట్టి రవి కుమార్, యాసరపు రామకృష్ణ, పీడీ చిక్కాల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చాగల్లు: అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం.మెరికమ్మ బుధవారం తెలిపారు. వర్షాలతో పంట, పశు, ప్రాణ నష్టం జరిగితే వెంటనే మండల ప్రజలంతా తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆమె కోరారు.

కోటసత్తెమ్మకు చండీహోమం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని చండీహోమం నిర్వహించినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ బుధవారం తెలిపారు. శ్రావణమాసంలో నెలరోజులపాటు ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు జరిగే చండీహోమంలో పాల్గొనే దంపతులు రూ.1116 చెల్లించాలన్నారు. పూజా ద్రవ్యాలు దేవస్థానం అందిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ తదితరులు పాల్గొన్నారు.

గట్టుక్కున మింగేసి..

- ఆక్రమణ చెరలో కాలువగట్లు
- బోదెల్లా దర్శనమిస్తున్న వైనం
- సాగు నీరదక శివారు రైతులు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

పెరవలి: పంట కాలువ గట్లు ఆక్రమణకు గురయ్యాయి. గట్లను ఎక్కడికక్కడే తొలచి చేలుగా మలచడంతో పలచబడి బోదెల్లా దర్శనమిస్తున్నాయి. ఈ గట్లపై నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయి. కాలువలు కుశించుకుపోవడంతో సాగునీరు పారక శివారు ప్రాంతాలకు సాగునీరందడంలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరవలి మండలంలో ప్రధాన కాలువలైన కాకరపర్రు కెనాల్, బ్యాంక్ కెనాల్, నరసాపురం కాలువలు ఉన్నాయి. వీటి నుంచి పిల్ల కాలువలు 69 ఉన్నాయి. ఈ కాలువల ద్వారా బ్రిటీష్ వారి ఏలుబడిలో గ్రామాలను పరిశీలించడానికి ఈ కాలువల ద్వారా పడవలపై వెళ్లేవారని ఇప్పుడు గట్టులు లేకపోవడంతో పాటు కాలువలు కూడా కనుమరుగయ్యాయి. ఈ ఆక్రమణలు గత 15 ఏళ్లలుగా చేస్తున్నా అధికారుల పట్టించుకోకపోవడంతో దళారీలు యథేచ్ఛగా ఆక్రమణలు చేయడం వలన కాలువల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

రాకపోకలకు వీలులేక..

మండలంలో కాకరపర్రు నుంచి ప్రారంభయమ్యే గరప కాలువ, పెరవలిలో భూపయ్య కాలువ, కాపవరంలో కాలువ, ఖండవల్లిలో నక్కల కాలువ, అన్నవరప్పాడులో బ్రాంచి కెనాల్, పేకేర్ కాలువ గట్లు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. ఈ గట్లపై మొక్కలు నాటడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. మల్లేశ్వరంలోని ఆచంట కాలువ, ముక్కామల చానల్, కాపవరం కాలువ గట్లపై పశువులశాలలు ఏర్పాటు చేయడం, ఇళ్లు నిర్మించడంతో రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. గట్లు కనుమరుగవడంతో నడిచివెళ్లే పరిస్థితి లేదని శివారు రైతులు గగ్గోలు పెడుతున్నారు. అంతే కాకుండా గట్లు ఉన్న చోట్ల గట్లనే పంట భూములుగా మలచి వాటిపై సాగు చేస్తున్నా అధికారులు



పెరవలిలో భూపయ్య కాలువ గట్టును ఆక్రమించి కట్టుకున్న ఇళ్లు

నిమ్మకు నీరెత్తినట్టి వ్యవహరించడం దారుణం అంటున్నారు. మల్లేశ్వరంలో పేకేరు కాలువ గట్టుపై అక్రమ లేఅవుట్ వేయడంతో పాటు గట్టునే రోడ్డుగా వేశారు. భూపయ్య కాలువ రెండు గట్లను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకోవడంతో కుచించుకుపోయింది. కాపవరం వెళ్లే కాలువను చెత్తా చెదారంతో నిండిపోయింది. ప్రతి ఏటా రైతులే కాలువను శుభ్రం చేసుకుంటున్నారు. 15 ఏళ్ల క్రితం వరకు ఈ గట్లపై ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు వచ్చేవని వీటి ద్వారా పంటల ఉత్పత్తులను తీసుకువచ్చేవారమని రైతులు చెబుతున్నారు. పంటలకు నీటిఎద్దడి వచ్చినప్పుడు తాత్కాలికంగా సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటారు గానీ శాశ్వతంగా కాలువలు తవ్వించి ఆక్రమణలు విడగొట్టి గట్లు నిర్మిస్తే చేలకు నీరు, రైతులకు విముక్తి లభిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా చర్యలు చేపడితే సాగుకి ఎటువంటి ఆటంకం లేకుండా సాగు నీరు అందుతుందని, లేనికుంటే కాలువలే కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు.



ఖండవల్లి కాలువ గట్టును ఆక్రమించి కట్టుకున్న ఇళ్లు



తీపర్రు వద్ద కాకరపర్రు కాలువ గట్టుపైనే వేసిన చెత్తా చెదారం



మల్లేశ్వరంలో కాలువగట్టునే లేఅవుట్‌కి రోడ్డు వేసిన దళారీలు

సాగునీరందక..



కాలువ గట్లు ఆక్రమణకు గురవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా శివారు భూముల రైతులకు సాగు నీరందడంలేదు. బోర్లపై పంటలు పండించుకోవలసిన దుస్థితి ఏర్పడింది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా స్పందించండి.

– జక్కంశెట్టి సుబ్బారావు రైతు కాపవరం

పంటలు తెచ్చేందుకు ఇబ్బంది



కాలువ గట్లు ఏమైపోయాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఆక్రమణల వలన కాలువలు పంట బోదెల్లా మారిపోయాయి. శివారు భూముల పంట ఉత్పత్తులు తేవాలంటే నానా అగచాట్లు పడుతున్నాం, ఎవరికి చెప్పినా పట్టించుకునే నాథుడే కరువైయ్యారు.

– ఈ కన్నయ్య, రైతు, ఖండవల్లి

గట్లపై సైకిల్ కూడా వెళ్లలేదు



నా చిన్న తనంలో కాలువగట్లపై ఎడ్లబండితో వెళ్లేవారాం. రానురాను ఆక్రమణలకు గురి అవ్వడంతో గట్లు మాయమైపోయాయి. ఇప్పుడు సైకిళ్లు కూడా వెళ్లలేని దుస్థితిలో కాలువగట్లు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

– కాపకా పాపారావు, రైతు, కాకరపర్రు

పలు కుటుంబాలకు ఆర్థిక సాయం



తూర్పుచోడవరంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: మండలంలో అనంతపల్లి, తూర్పుచోడవరం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న నాలుగు కుటుంబాలకు మానవత సంస్థ రూ.16వేలు ఆర్థిక సాయం అందజేసింది. అనంతపల్లిలో ములగాల బాటయ్య, గుడివాడ విజయ భార్గవి, తూర్పుచోడవరంలో పిట్టు ధర్మయ్య, కందుకూరు రామారావులకు ఒక్కో కుటుంబానికి రూ.4వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని బుధవారం సాయంత్రం అందజేశారు. ఆయా గ్రామాల్లో మానవత జిల్లా కార్యదర్శి భోగవల్లి వెంకటసుబ్బారావు, మండలశాఖ అధ్యక్షుడు పాకలపాటి వెంకటేశ్వరావు, మండల కన్వీనర్ గుళ్ల పూడివెంకటరత్నం, మండల కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు, ఎడ్వైజ్ బోర్డు మెంబరు మద్దు రామకృష్ణ, మండల సహాయ కార్యదర్శి ఓలిరెడ్డి సతీష్, సభ్యులు పెండ్యాల రామకృష్ణ, కొల్లూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మెప్పించేలా పనిచేయాలి

దేవరపల్లి: రైతలందరిని మెప్పించే విధంగా పనిచేయాలని సొసైటీ త్రిమెన్ కమిటీ చైర్‌పర్సన్ నోమేంద్ర రామారావుకు ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు సూచించారు. దేవరపల్లి సొసైటీ త్రిమెన్ కమిటీ చైర్మన్‌గా ఉప్పులూరి నోమోంద్ర రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపార్టీ అయినా కష్టపడే వ్యక్తులు పదవులు ఇస్తుందన్నారు. రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించి మన్ననలు పొందాలన్నారు.

మా స్థలాలు అప్పగించండి

- గౌరీపట్నంలో పట్టాలతో లబ్ధిదారుల నిరసన
- నాలుగేళ్లుగా తీరని ఇళ్ల స్థలాల సమస్య
- పట్టాలు ఇచ్చి స్థలాలు అప్పగించని అధికారులు

దేవరపల్లి: గౌరీపట్నంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల సమస్య దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతోంది. ప్రభుత్వం లబ్ధిదారులకు పట్టాలిచ్చి, ఇళ్ల స్థలాలు అప్పగించింది. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం ఆలస్యం కావడంతో కొంత మంది అడ్డుకుని స్థలాలను తీసుకున్నారు. దీనిపై అధికారులు తెలిపినా ఫలితం లేకుండాపోయింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చేస్తున్నారు. గ్రామంలోని ధర్మవరం రోడ్డులో 2021లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న లే అవుట్‌లో 23 మంది దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. వాటికి సంబంధించిన పట్టాలు(రిజిస్ట్రేషన్ డాక్యుమెట్లు) వారికి అందజేశారు. ఆ స్థలాలకు రాళ్ల పాతి ఇచ్చారు. అయితే ఆ స్థలాల్లో గృహనిర్మాణంలో



గౌరీపట్నంలో జగనన్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

జాప్యం జగరడంతో సమస్య ఏర్పడింది. పక్కనున్న కొంత మంది వ్యక్తులు ఆ స్థలాలు దళితులకు ఇవ్వడానికి వీల్లేదని అడ్డుపెట్టారు. గృహనిర్మాణం చేయడానికి వెళుతున్న లబ్ధిదారులను అడ్డుకుంటున్నారు. ఇటీవల స్థలాల్లోని సరిహద్దు రాళ్ల తొలగించి ఆటస్థలంగా మార్చి తమను అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు కుండా అర్జున్, టేకుమూడి సోమరాజు, టేకుమూడి శేఖర్, దండంగి వెంకటేశు, పిల్లి లక్ష్మణరావు, టేకుమూడి శ్రీనివాసరావు తెలిపారు. తనకు ఇచ్చిన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి వెళ్లగా కొంత మంది వ్యక్తులు అడ్డుకుని, స్థలంలోకి రానివ్వడంలేదని లబ్ధిదారురాలు కుండా రాధా తెలిపారు. దీనిపై జూన్ 6వ తేదీన కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు రాధ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ స్థలాలను పరిశీలించి, ఇరు వర్గాలతో చర్చలు జరిపారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇరువర్గాలు మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకుంటామని, దీనికి మూడు రోజులు గడువు కావాలని అడిగారని ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. తమ స్థలాలను వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు స్థలాల వద్ద పట్టాలతో నిరసన వ్యక్తం చేశారు.

లాభదాయకం.. గో ఆధారిత వ్యవసాయం

- జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

నల్లజర్ల: గోఆధారిత పద్ధతిలో కొబ్బరి తోటను సాగుచేయడంతో లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి నేతల మల్లికార్జునరావు అన్నారు. సింగరాజుపాలెంలో గో ఆధారిత వ్యవసాయాన్ని చేస్తున్న రైతు గద్దే సతీష్ వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ పద్ధతిలో పశువులను వ్యవసాయంలో అనుసంధానం చేస్తూ వాటికి ఒత్తిడి లేకుండా మేత మేయడం, వాటి నుంచి వచ్చే పేడ, మూత్రంతో పంట పండించడంతోపాటు చీడపీడలు నివారించవచ్చునన్నారు. కొబ్బరిలో వచ్చే తెల్లదోమ, పిందెరాలడం, సూక్ష్మపోషకాలను నివారించవచ్చున్నారు. పశువుల మూత్రం వినియోగం ద్వారా అందులో ఉండే సిట్రిక్ యాసిడ్‌తో కలుపు నివారణ జరుగుతుందన్నారు. రైతుకు ఉన్న 16 ఎకరాల కొబ్బరి తోటను ఇద్దరు కూలీల సాయంతో పశువులను ఉపయోగిస్తూ సమర్థవంతంగా చెట్టుకు 100 నుంచి120 కాయలు దిగుబడి తీస్తున్నట్టు రైతు వివరించారు. అదేవిధంగా భూమి గుల్లబారి నీటిఎద్దడి లేకుండా ఉంటుందన్నారు. తమ పొలంలో పశువులు స్వేచ్ఛగా మేతమేస్తూ, ఆరోగ్యంగా ఉంటూ స్వచ్ఛమైన పాలు అందిస్తున్నట్టు చెప్పారు. పెట్టుబడి ఖర్చు తగ్గించి సుస్థిరమైన వ్యవసాయం చేస్తూ రసాయనాలు లేని పంటను పండిస్తున్న రైతును మల్లికార్జునావు అభినందించారు. ఆయన తోపాటు స్థానిక ఉద్యాన అధికారి ఎం.బబిత ఉన్నారు.



సింగరాజుపాలెంలో గో ఆధారిత వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జునరావు

మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదం

నల్లజర్ల: విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమంటూ, ఈ విషయంపై అవగాహన కలిగిస్తూ బుధవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ దూబచర్ల సెక్టారు సూపర్‌వైజర్ హారతి మాట్లాడుతూ 25 ఏళ్ల యువతే అధికంగా బానిసలవుతున్నారని, ఈ మత్తు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు సమాజంలో కుటుంబ గౌరవం, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తాయన్నారు. పల్లెలకు చేరువైన మత్తు పదార్థానాలను తరిమికొట్టడానికి కేంద్ర ప్రభుత్వం నక్షా విముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా భారతదేశాన్ని మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు.



దూబచర్లలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉభయ తెలుగు రాష్ట్రాలలో 100కుపైగా డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దేవకి, పేరంటాలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంటపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై నరేంద్ర

చాగల్లు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా వినాయక మంటపాల వద్ద సీసీ కెమేరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఎస్సై కె.నరేంద్ర ఆదేశించారు. చాగల్లు పోలీస్‌స్టేషన్ వద్ద గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే పోలీసులకు అందించాలన్నారు. అసాంఘిక కార్యకలపాలు, అశ్లీల నృత్యాలకు సంబంధించిన కార్యక్రమాలు, పాటలు పెట్టకూడదని హెచ్చరించారు. వినాయక నిమజ్జనాలు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహించాలని, కమిటీ సభ్యులు పూర్తిగా పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకుఉల గండ్రోతు సురేంద్రకుమార్, జుట్టా ఏడుకొండలరావు, గ్రంధి రాంబాబు, అనిశెట్టి సూర్యం, జాన్ గంగారావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

చాగల్లు: నూతనంగా ఎన్నికైన త్రిసభ్య కమిటీ సభ్యులంతా సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కొవ్వూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు అన్నారు. చాగల్లు మండలం ఊనగట్ల పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా బొల్లిన శివనాగేంద్ర, డైరెక్టర్లుగా మిరియాల సతీష్, దొంగా లక్ష్మీనారాయణలు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన త్రిసభ్య కమిటీ సభ్యులను స్థానిక నాయకులు, రైతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నిడదవోలు రూరల్: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమిశ్రగూడెం మండలపరిషత్ కార్యాలయంలో గౌరవ అధ్యక్షుడు టి.గోపాలకృష్ణ అధ్యక్షతన ఎన్నిక సమావేశం జరిగింది. నూతన అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.భార్గవిదేవి, కేవీ సుబ్బన్న, ప్రధాన కార్యదర్శిగా కె.విజయరాజు, సంయుక్త కార్యదర్శిగా ఎం.రాంబాబు, కోశాధికారులుగా బి.మనోజ్‌ప్రకాష్, కె.రమేష్, ఉప కోశాధికారులుగా జి.కొండలరావు, బి.భీమేశ్వరరావులను ఎన్నుకున్నారు. నూతన



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎంపీడీఓ జగన్నాథరావు

కార్యవర్గాన్ని ఎంపీడీఓ జగన్నాథరావు, ఈఓపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

పోలీస్ స్టేషన్‌లో బోరు ఏర్పాటు

గోపాలపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంచినీటి సౌకర్యార్థం రూ.1.50 లక్షల వ్యయంతో బోరు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో మంచినీటి బోరు పనులు చేపట్టారు. ఈ బోరు ఏర్పాటుకు మండల పరిషత్ నిధులు రూ.1.50లక్షలను మంజూరు చేశారు. అయితే తర్వాత అవసరమైన పనిముట్లను వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నమనేని వెంకటరత్నం(చినబాబు) దుగ్గిరాల రమేష్‌బాబు సమకూరుస్తామని ఎస్సై డి.మనోహర్‌కు వివరించారు. దీంతో ఎస్సై ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదరికం లేని సమాజం కోసమే పీ4 విధానం

నిడదవోలు: పేదరికం లేని సమాజ నిర్మాణం కోసమే పీ4 విధానం లక్ష్యంగా పెట్టుకున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం పీ4 విధానంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్న ఉచిత బస్సు పథకంలో మహిళలందరూ అర్హులన్నారు. రాష్ట్రంలో 17 లక్షల మంది బంగారు కుటుంబాలను గుర్తించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, నిడదవోలు నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె. సతీష్, పెరవలి మండల ప్రత్యేక అధికారి ఎం.సునీల్ వినయ్, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల ఎంపీడీవో వీఎస్‌వీఎల్ జగన్నాథ రావు, రామారావు, గంటా శ్రీనివాసు, తహసీల్దార్లు బి.నాగరాజు నాయక్, పీఎస్ డీ ప్రసాద్, కె.నిరంజన్, మున్సిపల్ కమిషనర్ తోటా శ్రీకృష్ణవేణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి అనుసంధానంగా శ్రీసత్య సాయి సేవ సమితి ట్రస్ట్ అవసరాల నిమిత్తం రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం వంట సామగ్రి, అక్కడ పని చేస్తున్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నిడదవోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల హరి ప్రసాద్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మీసాల కాశీబాబు, కనకమహాలక్ష్మి, క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, గుంటుపల్లి శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, ఎండీ ఫయాజ్, ఈరిశెట్టి రాజగోపాలస్వామి, సానేపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా కురుస్తున్న వర్షం



దొమ్మేరు వద్ద వర్షానికి తడిచిన మొక్కజొన్నలు



దేవరపల్లిలో కురుస్తున్న వాన

- కోలుకున్న మెట్ట ఫైర్లు

దేవరపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గోపాలపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి విస్తారంగా వర్షం కురుస్తుంది. వర్షం రాత్రికి ఎక్కువ కావడంతో రాబోవు రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అధికారులు చెపుతున్నారు. వర్షానికి రోడ్ల పక్కన ఆరబెట్టిన మొక్కజొన్న తడిచినట్టు రైతులు తెలిపారు. వర్షాలు లేకపోవడం, బోర్లు సరిగా పనిచేయకపోవడంతో నీటి ఎద్దడితో ఎండిపోతున్న పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు అంటున్నారు. వరి, మొక్కజొన్న, కూరగాయలు, అపరాల పంటలకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో వర్షం కురుస్తుంది.

జిల్లాలో భారీ వర్షాలు

పెరవలి: దక్షిణ ఒడిశా తీరంలో అల్పపీడన ప్రభావంతో 13, 14 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.నిరంజన్ తెలిపారు. వర్షం కురుస్తున్నప్పుడు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని, చెట్లకింద ఉండొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన తెలిపారు.